


స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక



వరంగల్	సంపుటి : 02	సంచిక : 109	ఎడిటర్ : డి.శివకృష్ణ	శుక్రవారం	06-11-2026	పేజీలు : 04	వెల : 2/-
WARANGAL	VOL : 02	ISSUE : 109	EDITOR : D.SHIVAKRISHNA	FRIDAY	06-11-2026	PAGES : 04	PRICE : 2/-

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts

కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన..

అభివృద్ధి పనులపై ఫోకస్



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నవంబరు 7, 8, 9 తేదీల్లో కొడంగల్‌లో పర్యటించనున్నారు. మూడు రోజుల పాటు కొడంగల్ నియోజకవర్గంలో సీఎం వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రూ.9,053 కోట్లతో 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. రూ.46.08 కోట్లతో నిర్మించిన 10 ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలకు హాజరుకానున్నారు. నవంబరు 7వ తేదీన హకీంపేటలో మెగా రైతుమేళా, ఇండస్ట్రీయల్ ఎక్స్‌పోను ప్రారంభించనున్నారు. రైతుమేళాలో ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సీఎం ముఖాముఖి నిర్వహించనున్నారు.పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. నవంబరు 8వ తేదీన స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. లగచర్ల ఇండస్ట్రీయల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నారు. రూ.5,060 కోట్లతో కొత్వాల్‌గూడ – నాచారం రేడియల్ రోడ్డు –2కు శంకుస్థాపన చేయనున్నారు. రూ.2,100 కోట్లతో ఎంఎన్‌కేఎల్ఐఎస్ రెండో దశ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రూ.1,410 కోట్లతో 223 బీటీ రహదారుల నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. కొడంగల్‌లో రూ.123 కోట్లతో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి సంబంధించిన పనులకు శ్రీకారం చుట్టనున్నారు. రూ.118.80 కోట్లతో ఏర్పాటు చేసే 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్టాండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. పోలీస్ స్టేషన్లు, ఆస్పత్రులు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభోత్సవాలకు హాజరుకానున్నారు. **(మిగతా 2లో..)**

అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలి..

రేవంత్ ప్రభుత్వానికి కవిత డెడ్‌లైన్



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

ఖానామెట్‌లోని అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అందుకోసం రేవంత్ ప్రభుత్వానికి నెల రోజులు సమయం ఇస్తున్నామన్నారు. అయ్యప్ప సొసైటీలో ఇల్లు కొని ఎవరూ నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. ఈ అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు ఉండవని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ సొసైటీలో 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని వివరించారు.గురువారం హైదరాబాద్‌లో కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. అయ్యప్ప సొసైటీలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సొసైటీలోనే నారాయణ, చైతన్య విద్యా సంస్థలు ఉన్నాయని గుర్తు చేశారు. సర్వే నెంబర్ 11/18 నుంచి 11/44 వరకు అక్రమ నిర్మాణాలు జరిగాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్ భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమి కనిపించటం లేదని వ్యంగ్యంగా అన్నారు. ఈ దందా ఆపించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్పష్టం చేశారు. గురుకుల ట్రస్ట్ భూములపై అనేక ఉద్యమాలు చేశామని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ వచ్చి.. రాజకీయాలు తప్ప ఏం మాట్లాడలేదని అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా చేస్తే.. అమిత్ షా హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారని వివరించారు. బీఆర్ఎస్ పార్టీపై మాట్లాడటం పని కొచ్చే అంశం కాదని టీఆర్ఎస్ చీఫ్ కవిత అభిప్రాయపడ్డారు.

సింగరేణి కార్మికులకు కేంద్రం గుడ్‌న్యూస్..

రూ.1.10 లక్షల దీపావళి బోనస్



ఢిల్లీ :

దీపావళి పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. గురువారం ఒక్కో సింగరేణి కార్మికుడికి రూ.1,10,250 పీఎల్ఆర్ బోనస్ చెల్లించనుంది. కోల్ ఇండియా సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశంలో బోనస్ చెల్లింపుపై నిర్ణయం తీసుకున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థల పనితీరును పరిగణనలోకి తీసుకుని పీఎల్ఆర్ బోనస్‌ను ఖరారు చేశారు. ఇప్పటికే దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు లాభాల వాటా కింద సగటున ఒక్కొక్కరికి రూ.1,53,912 చెల్లింపులు జరిపిన విషయం తెలిసిందే. తాజాగా PLR బోనస్‌తో కార్మికులకు పండుగ వేళ మరింత ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. **(మిగతా 2లో..)**

ఎస్ఎస్ఆర్‌కు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల



ఢిల్లీ:

నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటరు జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. 2027 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించింది. ఈసీఐ ఆదేశాల మేరకు అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ అండ్ డామన్ అండ్ డయ్యూ, మిజోరం, ఒడిశా, సిక్కింలో అధికారులు ఎస్ ఎస్ఆర్ నిర్వహించనున్నారు. 2026 నవంబర్ 20లోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణను పూర్తి చేయాలని ఈసీఐ ఆదేశించింది. 2026 నవంబర్ 30న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపింది. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 30 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరించనున్నట్లు వెల్లడించింది. 2027 జనవరి 16లోగా అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. 2027 జనవరి 21న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపింది.

కొత్త ఓటర్లకు అవకాశం..

మరోవైపు, కొత్త ఓటర్ల నమోదుకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. 2027 జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే యువత ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఈసీఐ తెలిపింది. 2027 ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే యువత కూడా ముందస్తుగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఓటరు జాబితాలో పేరు చేర్చేందుకు ఫారం-6, విదేశాల్లో నివసించే భారతీయ ఓటర్లు ఫారం-6ఏ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపునకు ఫారం-7, చిరునామా మార్పు, వివరాల సవరణ, జూ×జ మార్పు కోసం ఫారం-8ను వినియోగించాలని వెల్లడించింది.

అధికారులకు ఈసీఐ ముఖ్యమైన మార్గదర్శకాలు

ఆధార్ నంబర్ ఇవ్వడం ఐచ్ఛికం. ఆధార్ ఇవ్వలేదనే కారణంతో ఓటరు నమోదు **(మిగతా 2లో..)**

మహిళలకు హార్మోనల్ ఇంజెక్షన్లు ఇచ్చి అండాల సేకరణ?..

అండాల సేకరణ రాకెట్‌పై సీపీ సుమతి కీలక వ్యాఖ్యలు



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పరిధిలో వెలుగుచూసిన అక్రమ అండాల సేకరణ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి వెల్లడించారు. తొలిగా వ్యభిచార సంబంధిత రాకెట్‌గా భావించి విచారణ చేపట్టగా, అనంతర విచారణలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అండాల సేకరణ వ్యవహారం బయటపడిందని తెలిపారు. తొలుత వ్యభిచార సంబంధిత రాకెట్‌గా భావించి విచారణ ప్రారంభించగా, ఆ తర్వాత అక్రమ అండాల సేకరణ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. **(మిగతా 2లో..)**

కంకణం కట్టుకున్నా.. రెండేళ్లలో చేసి చూపిస్తా

మంత్రి కోమటిరెడ్డి కీలక వ్యాఖ్యలు

స్టార్ త్రినేత్రం, నల్లగొండ



ఎన్ఎల్బీసీ సొరంగ మార్గం పూర్తయితే ఎంత కరువు వచ్చినా శ్రీశైలం డెడ్ స్టోరేజ్ నుండి నీటిని తీసుకొని రైతులకు సాగునీరు అందించవచ్చని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానంతరం మంత్రి మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులు అత్యంత కీలకమైనవని, రైతులకు సంబంధించి ఈ పదవులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, రైతులకు సేవ చేసే అవకాశం వీటి ద్వారా లభిస్తుందని అన్నారు. నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన కోరారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నల్లగొండ మార్కెట్‌కు సంబంధించి రెండవ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని అన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్తును ప్రస్తుతం అన్ని రాష్ట్రాలలో అమలు చేస్తున్నాయని, ఇది గర్వకారణం అని అన్నారు.ఎస్ఎల్బీసీ ద్వారా ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించడమే కాకుండా జిల్లా అంతటికి సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో 2000 కోట్ల రూపాయలతో చేపట్టిన ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పనులు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోగా, ప్రజాపాలన ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులను తిరిగి చేపట్టామని, దురదృష్టవశాత్తు మధ్యలో మళ్లీ పనులు ఆగగా ఇటీవలే పనులు ప్రారంభించి **(మిగతా 2లో..)**

విదేశీ ప్రయాణికులకు అలర్ట్..

అమల్లోకి కొత్త ఇమ్మిగ్రేషన్ రూల్స్!



ఢిల్లీ:

విదేశీయుల ప్రవేశం, భారతీయుల అంతర్జాతీయ ప్రయాణాలకు సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలక మార్పులు తీసుకొచ్చింది. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ (ఎగ్జంప్షన్) ఆర్డర్-2025కు సవరణలు చేస్తూ ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ (ఎగ్జంప్షన్) (అమెండ్‌మెంట్) ఆర్డర్-2026ను జారీ చేసింది. నవంబర్ 4న ఉత్తర్వులు జారీ చేయగా, నవంబర్ 5న గెజిట్‌లో ప్రచురించారు. ప్రచురితమైన తేదీ నుంచే కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి.

నేపాల్, భూటాన్ ప్రయాణాలకు కొత్త మార్గదర్శకాలు:

నూతన నిబంధనల ప్రకారం.. భారత్ నుంచి నేపాల్, భూటాన్ దేశాలకు వెళ్లే లేదా ఆ దేశాల నుంచి వచ్చే భారత పౌరులు తమ గుర్తింపు కోసం **(మిగతా 2లో..)**

రాజస్థాన్, మహారాష్ట్ర మోడల్‌లో

తెలంగాణలో జల సంరక్షణ..

మంత్రి ఉత్తమ్ కీలక సమీక్ష!

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :



రాష్ట్రంలో భూగర్భ జలాల సంరక్షణ, పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భూగర్భ జలాలను కాపాడేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ అంశంపై ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న జల సంరక్షణ కార్యక్రమాలను అధ్యయనం చేసి, తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. గురువారం కరువు ఉపశమనం, భూగర్భజలాల సంరక్షణపై ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షలో నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల అధికారులు హాజరయ్యారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,భూగర్భజల, నీటిపారుదల ప్రణాళికలు, భూగర్భజలాల సంరక్షణ చర్యలకు కార్యాచరణ ప్రణాళిక ఖరారుపై చర్చించారు. **(మిగతా 2లో..)**

2 | వరంగల్ WARANGAL | సంపుటి: 02 VOL : 02 | సంచిక: 109 ISSUE : 109 | స్టార్ త్రినేత్రం అనుక్షణం అక్షరసత్యం | శుక్రవారం FRIDAY | 06-11-2026 06 - 11- 2026 | పేజీలు: 04 PAGES : 04 | వెల: 2/- PRICE : 2/-

కంకణం కట్టుకున్నా.. రెండేళ్లలో చేసి చూపిస్తా

(మొదటిపేజీ తరువాయి)

చురుకుగా కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. బ్రాహ్మణ వెల్లేములను కూడా తమ హయాంలోనే చేపట్టడం జరిగిందని, ఇప్పటివరకు 35000 ఎకరాలకు సాగునీరు అందించగా, లక్ష ఎకరాలకు తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఎస్ఎల్బీసీ ద్వారా జిల్లా మొత్తం సస్యశ్యామలం చేయడానికి కంకణం కట్టుకొని పని చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతులకు సేవ చేయడం అదృష్టంగా ప్రతి ఒక్కరూ భావించాలని అన్నారు. ఏఎంఆర్పీ కాలువల లైనింగును 450 కోట్ల రూపాయలు తో చేపట్టడం జరిగిందని, ముశంపల్లి సబ్ స్టేషన్ మంజూరు చేయించడం జరిగిందని, అలాగే రోడ్డు మంజూరు చేయించామని తెలిపారు. జిల్లాలో కాలువలు, రిజర్వాయర్లు పూర్తయితే చుట్టుపక్కల బోర్లు రీఛార్జ్ అవుతాయని అన్నారు. రెండేళ్లలో జిల్లాలో మట్టి రోడ్డు కూడా లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్లో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా, రాష్ట్ర ప్రజలకు ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి, తదితరులు హాజరయ్యారు. కాగా నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్గా బీ. హేమలత వెంకటరెడ్డి, వైస్ చైర్మన్గా వి. శ్రీనివాస్ గౌడ్తో పాటు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

మహిళలకు హార్మోనల్ ఇంజెక్షన్లు ఇచ్చి అండాల సేకరణ?..

(మొదటిపేజీ తరువాయి)

హార్మోనల్ ఇంజెక్షన్లు ఇచ్చారా?:

ఈ కేసులో మహిళలకు హార్మోనల్ ఇంజెక్షన్లు ఇచ్చి అండాలు సేకరించారా? అనే అంశంపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఆమె తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి స్వాధీనం చేసుకున్న హార్మోనల్ ఇంజెక్షన్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఫీూూ)కి పంపించామని వాటిపై నివేదిక వచ్చిన తర్వాతే బాధిత మహిళలకు ఆ ఇంజెక్షన్లు ఉపయోగించారా? లేదా? అన్నది స్పష్టమవుతుందని సీపీ వెల్లడించారు. అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ సెంటర్లు, ఫెర్టిలిటీ సెంటర్ల మధ్య వేర్వేరు బాధ్యతలు ఉంటాయని సీపీ వివరించారు. ఈ కేసులో ఏఆర్టీ సెంటర్ల ద్వారా బాధిత మహిళలతో సంప్రదింపులు జరిపిన అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎగ్ డొనేషన్ పేరుతో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగాయా? నిబంధనలకు విరుద్ధంగా అండాల సేకరణకు పాల్పడ్డారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

ఆధారాలుంటేనే నిందితులుగా గుర్తింపు:

రాష్ట్రంలో ఇలాంటి వ్యవహారం వెలుగులోకి రావడం తొలిసారి కావడంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి కేసును ఛేదించారని సీపీ తెలిపారు. తల్లి కావాలనుకునే వారు బిడ్డ ఆరోగ్యం గురించి ఆలోచిస్తున్నప్పటికీ, అండాలను ఏ విధంగా సేకరిస్తున్నారనే అంశాన్ని పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు. అయితే ఈ కేసులో సంబంధం ఉన్న వారందరినీ నిందితులుగా పరిగణించలేమని స్పష్టం చేశారు. ఎవరి పాత్రకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు లభిస్తాయో వారినే నిందితులుగా గుర్తిస్తామని సీపీ వెల్లడించారు.

కొడంగల్లో సీఎం రేవంత్రెడ్డి పర్యటన..

(మొదటిపేజీ తరువాయి)

నవంబరు 9వ తేదీన హకీంపేటలో భారీ రైతు బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు. రైతు సభకు 10 జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. సీఎం రేవంత్రెడ్డి కొడంగల్లో తన మూడు రోజుల పర్యటనలో అభివృద్ధి పనులు, వ్యవసాయం, పరిశ్రమలు, మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు.

విదేశీ ప్రయాణికులకు అలర్ట్..

'వీసా మాన్యువల్' లోని ఏదైనా ఒక పత్రాన్ని ఇమ్మిగ్రేషన్ అధికారులకు చూపించాలి. నేపాల్, భూటాన్ పౌరులకు కూడా ఇదే వర్తిస్తుంది. అయితే సరిహద్దు మార్గాల ద్వారా చైనా, మకావు, హాంగ్కాంగ్ లేదా పాకిస్థాన్ మీదుగా వచ్చే ఇతర ప్రయాణికులకు చెల్లుబాటు అయ్యే పాస్పోర్ట్, వీసా తప్పనిసరి. ఇతర విదేశాలకు వెళ్లే భారతీయులు కూడా నిర్దేశిత చెక్పోస్టుల ద్వారానే ప్రయాణించాలి.

సైనిక సిబ్బంది, శరణార్థులకు ఊరట:

విధులు నిర్వహించే భారత సాయుధ దళాల సిబ్బందికి, ప్రభుత్వ రవాణాలో వారితో ప్రయాణించే కుటుంబ సభ్యులకు పాస్పోర్ట్, వీసా నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు. అలాగే 2015 జనవరి 9కి ముందు నమోదైన శ్రీలంక తమిళ శరణార్థులకు, 2024 డిసెంబర్ 31 లేదా అంతకంటే ముందు మతపరమైన వేధింపుల వల్ల అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి భారత్కు వచ్చిన మైనారిటీలకు (హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ, క్రైస్తవ) పాస్పోర్ట్ లేకున్నా ప్రత్యేక మినహాయింపులు కల్పించారు.

పాకిస్థాన్, మలేషియా, సింగపూర్ నుండి వచ్చిన వారికి షరతులు:

దేశ విభజన తర్వాత పాకిస్థాన్ వెళ్లి తిరిగి వచ్చి కేరళలో స్థిరపడిన అర్హులైన భారత మూలాలున్న ముస్లిం పురుషులకు, 2009 డిసెంబర్ 31 నాటికి పాకిస్థాన్ నుంచి వచ్చి సాంకేతిక కారణాలతో పాస్పోర్ట్ రెన్యూ చేసుకోలేని వారికి ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. గతంలో భారత పాస్పోర్ట్ కలిగి ఉండి, ప్రస్తుతం మలేషియా లేదా సింగపూర్ పౌరసత్వం పొందిన భారతీయ సంతతి వ్యక్తులు కూడా కొన్ని షరతులతో ఈ మినహాయింపులు పొందేలా కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ సందీప్ ఎన్. మహాత్మే ఉత్తర్వులు జారీ చేశారు.

సింగరేణి కార్మికులకు కేంద్రం గుడ్న్యూస్..

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ఇంధన భద్రతకు సింగరేణి కార్మికులు వెన్నెముకగా నిలుస్తున్నారన్నారు. బొగ్గు రంగ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. కార్మికులకు మెరుగైన పని పరిస్థితులు, భద్రత, ఆర్థిక భరోసా కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సింగరేణి అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కేంద్రం సహకారం కొనసాగుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు మీడియాకు ప్రకటన విడుదల చేశారు.

రాజస్థాన్, మహారాష్ట్ర మోడల్లో

తెలంగాణలో జల సంరక్షణ..

(మొదటిపేజీ తరువాయి)

భూగర్భజలాల కోసం ప్రత్యేక బడ్జెట్:

భూగర్భజలాల పరిరక్షణకు అవసరమైన బడ్జెట్ కేటాయిస్తామని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ తెలిపారు. అవసరమైతే ఇప్పటికే కేటాయించిన బడ్జెట్కు మించి కూడా నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. భూగర్భజల శాఖ పనితీరు, ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, భవిష్యత్తులో అమలు చేయాల్సిన కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని అధికారులకు సూచించారు. అన్ని జిల్లాల భూగర్భజల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, జిల్లాలవారీగా భూగర్భజలాల స్థితిగతులను పరిశీలించాలని ఆదేశించారు.

రాజస్థాన్, మహారాష్ట్రలో జల సంరక్షణపై అధ్యయనం:

భూగర్భజలాల పునరుద్ధరణలో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా రాజస్థాన్లో అమలు చేస్తున్న భూగర్భజల పునరుద్ధరణ చర్యలను, మహారాష్ట్రలో చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. అక్కడి విజయవంతమైన విధానాలను తెలంగాణలోనూ అమలు చేసేందుకు అవకాశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల అనుభవాలను వినియోగించుకుని భూగర్భజలాల పరిరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఎస్ఎస్ఆర్కు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తును తిరస్కరించకూడదు. ఇప్పటికే ఉన్న పేర్లను తొలగించ కూడదు. ఒకే ఇంట్లో నివసించే కుటుంబ సభ్యులందరి పేర్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రం, ఒకే విభాగంలో ఉండేలా చూడాలి. ఒక పోలింగ్ కేంద్రంలో సాధారణంగా 1,200 మందికి మించి ఓటర్లు ఉండకూడదు. ఓటరు జాబితాలోని డూప్లికేట్ పేర్లు, మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలి. పేర్ల తొలగింపునకు ముందు క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి, అవసరమైన నోటీసులు జారీ చేయాలి. సంబంధిత వ్యక్తికి తన వాదన వినిపించుకునే అవకాశం కల్పించాలి. ఒక పోలింగ్ కేంద్రం లోని మొత్తం ఓటర్లలో 2 శాతానికి మించి పేర్ల తొలగింపులను ప్రతిపాదించినా, ఒకే వ్యక్తి ఐదు కంటే ఎక్కువ అభ్యంతరాలు దాఖలు చేసినా ERO స్వయంగా వాటిని పరిశీలించాలి. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవచ్చు. BLA\T రోజుకు గరిష్ఠంగా 10 ఫారాలను (ఫారం-6/7/8) బూత్ లెవల్ ఆఫీసర్లకు (దీూూ) సమర్పించవచ్చు. కాగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ సహా మరో 10 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని, ఆయా ప్రాంతాల్లో ఎస్ఎస్ఆర్ షెడ్యూల్ను తర్వాత ప్రకటించనున్నట్లు ఈసీఐ స్పష్టం చేసింది. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, లద్దాఖ్లోని వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఓటరు జాబితాల సవరణ షెడ్యూల్ను ప్రకటించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

ఇందిరమ్మ ఇంటిలో రేవంత్ రెడ్డి

దీపావళి వేడుక.. బీఆర్ఎస్పై మాస్టర్ ప్లాన్!



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

ఈ ఏడాది దీపావళి వేడుకలను 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో వినూత్నంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల నెరవేరిన లబ్ధిదారుల ఇళ్లలో దీపాలు వెలిగించి వారితో కలిసి వండుగ జరుపుకోవాలని సంకల్పించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. పేదల సొంతింటి కల సాకారమైన వేళ ఈ దీపావళి సందర్భంగా తాను ఇందిరమ్మ ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో కలిసి వండుగ జరుపుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు కూడా ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కానున్నారు.

బీఆర్ఎస్ పై రేవంత్ సర్కార్ మాస్టర్ ప్లాన్:

కాగా, రాష్ట్రంలో అధికార ప్రతిపక్షాల మధ్య రాజకీయం రంజుగా సాగుతున్న వేళ రేవంత్ సర్కార్ దీపావళి వేడుకలను ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో జరుపుకోవాలని నిర్ణయించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. నిజానికి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం అమలైన తీరును, తమ ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పోలుస్తూ అధికార పార్టీ నేతలు పలు సందర్భాల్లో వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాల్లో మేము ఓట్లు అడగమని అలాగే బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఉన్న గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగాలని హస్తం పార్టీ ట్రిగ్గర్ చేస్తోంది. ఇటీవల రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి సవాల్ విసిరారు. సవాళ్లు ప్రతి సవాళ్లు కొనసాగుతున్న ఈ స్కీమ్ విషయంలో ప్రభుత్వం ఏకంగా లబ్ధిదారులతో వండగ జరుపుకోవాలని నిర్ణయించడం వెనుక పేదలకు ఇండ్ల విషయంలో గత బీఆర్ఎస్ వైఫల్యాన్ని ఎత్తిచూపేలా రేవంత్ సర్కార్ మాస్టర్ ప్లాన్ చేస్తోందనే చర్చ జరుగుతోంది.

వేములవాడ రూరల్ తహశీల్దార్ కార్యాలయానికి ఎకరం స్థలం కేటాయింపు

మార్కెట్ యార్డులో తహశీల్దార్ కార్యాలయం ఏకగ్రీవంగా తీర్మానం

మార్కెట్ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ: చైర్మన్ రొండి రాజు

మరిపెల్లి మార్కెట్ అభివృద్ధికి రూ.3.94 కోట్ల నిధులు మంజూరు

వేములవాడ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషి అభినందనీయం: రొండి రాజు



స్టార్ త్రినేత్రం, వేములవాడ :

వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సాధారణ సమావేశం చైర్మన్ రొండి రాజు అధ్యక్షతన గురువారం మార్కెట్ కమిటీ యార్డు కార్యాలయంలో నిర్వహించారు. ఈసమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కార్యదర్శి సరోజన, మరియు పాలకవర్గ డైరెక్టర్లందరూ పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు మాట్లాడుతూ, తమ పాలకవర్గం ఏర్పడి రెండు సంవత్సరాల కాలం పూర్తవుతున్న సందర్భంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు, వేములవాడ రూరల్ మండల నూతన తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు కోసం మార్కెట్ కమిటీ యార్డులో ఎకరం స్థలాన్ని కేటాయిస్తూ పాలకవర్గ సభ్యులు, సెక్రటరీ సమక్షంలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింద న్నారు.?తమకు పదవి ఇచ్చి, మార్కెట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్కు ఈ సందర్భంగా చైర్మన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మార్కెట్ కమిటీకి స్వంత స్థలం లేని విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి, కలెక్టర్ ద్వారా మరిపెల్లి గ్రామంలో 12 ఎకరాల విశాలమైన స్థలాన్ని కేటాయించేలా చొరవ తీసుకున్నారని కొనియాడారు. అంతేకాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో మరిపెల్లి మార్కెట్ అభివృద్ధికై రూ. 3 కోట్ల 94 లక్షల 40 వేల భారీ నిధులను మంజూరు చేయించారాని వెల్లడించారు.?గత మూడేళ్ల పాలనా కాలంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నేతృత్వంలో నియోజకవర్గంలో అపూర్వమైన అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. రైతుల సంక్షేమం కోసం మర్రిపెల్లిలో రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు 40 ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు.దక్షిణకాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని గోశాల కొరకు కూడా మరిపెల్లిలోనే మరో 40 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. వీటితో పాటు గత పదేళ్లుగా మూలకుపడ్డ మరిపెల్లి రిజర్వాయర్ పనులను పునరుద్ధరించి, ఇప్పటికే దాదాపు 75 శాతం పనులను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని చెప్పారు.?వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సమగ్ర అభివృద్ధి కొరకు దాదాపు రూ. 250 కోట్లు మంజూరు చేయించి, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో పనులు యుద్ధప్రాతిపదికన వేగవంతంగా సాగేలా చూస్తున్న ఘనత పూర్తిగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్కే దక్కుతుందన్నారు. గత 30 ఏళ్ల కాలంలో కొందరి దొరల పాలన మరియు తండ్రీ కొడుకుల పరిపాలనలోనే నియోజకవర్గం సాగిందని, వారు చేయలేని అభివృద్ధిని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈ మూడేళ్లలోనే చేసి చూపించారని ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. కింది స్థాయి నుంచి వచ్చిన బీసీ ముద్దుబిడ్డ అయిన ఎమ్మెల్యే వేములవాడను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.?తమ రెండు సంవత్సరాల పాలనా కాలంలో ఇప్పటివరకు 10 పాలకవర్గ సమావేశాలను విజయవంతంగా నిర్వహించుకున్నామని చైర్మన్ తెలిపారు. ఈ సమావేశాలు మరియు మార్కెట్ విధులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో సాగేందుకు నిరంతరం సహకరించిన రైతులకు పూర్వపు సెక్రటరీలకు, ప్రస్తుత సెక్రటరీకి, మార్కెట్ సిబ్బందికి, టైపిస్టులకు మరియు సెక్యూరిటీ గార్డులందరికీ చైర్మన్ రొండి రాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

'అమరవీరుల స్ఫూర్తితో అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి'

కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ దినేష్ కుమార్

స్టార్ త్రినేత్రం, హనుమకొండ:



ప్రగతిశీల విద్యార్థి అమరవీరుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో నెలకొన్న అసమానతలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ సెమినార్ హాల్లో ప్రగతిశీల విద్యార్థి అమరవీరుల వర్ధంతి సభను యూనివర్సిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహించారు. కామ్రేడ్ బి. వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యవక్తగా పాల్గొన్న దినేష్ కుమార్ మాట్లాడుతూ శాస్త్రీయ విద్యను అభ్యసించడంతో పాటు సమాజ మార్పులో విద్యార్థులు క్రియాశీలక పాత్ర పోషించాలని అన్నారు. ఢిల్లీ కేంద్రంగా విద్యార్థులు సాగిస్తున్న పోరాటాలు చూస్తుంటే యువత మరోసారి చరిత్రను తిరగరాస్తోందని, దేశ భవిష్యత్తుపై ఆశలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా యువత చేస్తున్న పోరాటాలకు ప్రజల మద్దతు లభించడం ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనమన్నారు.మాజీ పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్న అప్పారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మతం పేరుతో జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగంతో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే దేశ సంపదను మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు దోచిపెడుతోందని విమర్శించారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీల వరకు విద్యారంగం అనేక సమస్యలతో సతమతమవుతోందన్నారు. ఉన్నత విద్యాసంస్థలకు నిధులు కేటాయించకపోవడం, ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల ప్రభుత్వ విద్య బలహీనపడుతోందని విమర్శించారు. మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను దూరం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొంటూ తక్షణమే విద్యాశాఖకు మంత్రి నియమించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర నాయకుడు సూత్రపు అనిల్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, నాయకులు ముషారఫ్, దీక్షిత్ రెడ్డి, శివ, ఆలీ, సూర్య, పృథ్వీ, యోగి తదితరులు పాల్గొన్నారు.

సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేకూర్తి నవీన్ పటేల్ కూ ఘన సన్మానం

భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ట్రస్ట్ సభ్యుల ఆకాంక్ష

స్టార్ త్రినేత్రం,వేములవాడ :





సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో చేకూర్తి నవీన్ పటేల్ కూ ట్రస్ట్ సభ్యులు ఘన సన్మానం చేశారు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వేములవాడ టౌన్ అధ్యక్షులు గా చేకూర్తి నవీన్ నూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు వారికి ట్రస్ట్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసారు చేకూర్తి నవీన్ ప్రజా సేవలో ముందుంటూ వారు చేసిన సేవల కూ ఈ పదవి రావడం చాలా సంతోషం గా ఉందని వారు భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ట్రస్ట్ సభ్యులు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా చేకూర్తి నవీన్ మాట్లాడుతూ నన్ను పిలిచి నాకు సన్మానం చేసిన సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు సామాజిక సేవలు చేస్తూ పేదలకు అండగా ఉంటున్న సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ సేవలు చాలా గొప్పవని ఈ సందర్భంగా అన్నారు ఈ సన్మాన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏద్దండి రాజు, వాసాల హరి ప్రసాద్,గొంటి నవీన్, పబ్బ సురేష్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు

మానవత్వం చాటుకున్న వేములవాడ పట్టణ పోలీసులు.



ప్రజా రక్షణే కాదు ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడం కూడా పోలీసుల బాధ్యత.

స్టార్ త్రినేత్రం, వేములవాడ :

వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో ఈరోజు సాయంత్రం శివ అనే వ్యక్తి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి రోడ్డుపై కుప్పకూలిపోయాడు. అదే సమయంలో విధి నిర్వహణలో భాగంగా అక్కడ ఉన్న కానిస్టేబుళ్లు సల్మాన్, షకీల్, పంతులు నాయక్, నరేందర్, సతీష్ కుమార్, రాజ్‌కుమార్ ఈ విషయాన్ని గమనించారు.వెంటనే స్పందించిన పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బాధితుడి వద్దకు చేరుకుని మానవతా దృక్పథంతో ప్రథమ చికిత్స అందించారు. బాధితుడికి అవసరమైన సహాయం చేస్తూ చేతులు, కాళ్లు రుద్దడంతో కొద్దిసేపటికే ఆయన స్పృహలోకి వచ్చాడు.విధి నిర్వహణలో ఉన్నప్పటికీ ఆపదలో ఉన్న వ్యక్తిని గమనించి, తక్షణమే స్పందించి మానవత్వం చాటుకున్న పోలీసు సిబ్బందిని స్థానిక ప్రజలు అభినందించారు.

నవంబర్ 15లోపు సిద్ధం చేసుకోండి..

గ్లోబల్ సమ్మిట్‌పై రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :


తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డిసెంబరు 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించ తలపెట్టిన గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు హాజరయ్యే జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రతినిధికి లైజనింగ్ అధికారులను నియమించాలని సూచించారు. సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధుల రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితో పాటు సెక్యూరిటీ అధికారిని నియమించాలని ఆదేశించారు. సమ్మిట్ నిర్వహణలో సమన్వయంతో వ్యవహరించాలని, భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు.

నవంబర్ 15 నాటికి ప్రణాళిక సిద్ధం చేసుకోండి:

తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతలు, పర్యాటక ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను గ్లోబల్ సమ్మిట్‌లో ప్రదర్శించాలని సీఎం సూచించారు. వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాలపై సమ్మిట్‌లో చర్చలు జరిగేలా కార్యక్రమాలను రూపొందించాలని చెప్పారు. అదేవిధంగా నర్సరీ స్థాయి నుంచి ఆక్స్‌ఫర్డ్ స్థాయి వరకు తెలంగాణ విద్యావ్యవస్థలోని వివిధ అంశాలు, విద్యారంగంలో వస్తున్న మార్పులు ప్రతిబింబించేలా చర్చలు నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నవంబర్ 15వ తేదీ నాటికి సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లపై పూర్తి స్థాయి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్‌కు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని సీఎం సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రతిష్టను మరింత పెంచేలా సమ్మిట్ నిర్వహణ ఉండాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో పాటు ప్రతి అంశాన్ని ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు.

బాంతు శ్రీదేవి పేరు మీద ప్రత్యేక పూజలు చేసిన వికలాంగుడు ఓదెల నరేష్





స్టార్ త్రినేత్రం, కరీంనగర్ :

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన ఓదెల నరేష్ గురువారంరోజున నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ శ్రీ నావనాథ సిద్దేశ్వరస్వామిసిద్దులగుట్టలోహైదరాబాద్ చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేరు మీద ప్రత్యేక పూజలు చేసిన నిరుపేద వికలాంగుడు ఓదెల నరేష్ వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కలిగి ఉండాలని రానున్న రోజుల్లో మరెన్నో పదవులు పొందాలని వారి ఫ్యామిలీ సంపూర్ణ ఆరోగ్యం తో జీవించాలని వికలాంగుడు ఓదెల నరేష్ కోరుకున్నాడు.

మరో తుపాను ముప్పు..

కలవరపడుతున్న కోస్తాంధ్ర

స్టార్ త్రినేత్రం, అమరావతి :



నవంబర్ 9 నుంచి 16 తేదీల మధ్య బంగాళాఖాతంలో కొత్తగా మరో వాతావరణ సంక్షోభం ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. సముద్రంలో ఆవర్తనం ఏర్పడి, అది క్రమేణా అల్పపీడనంగా బలపడి తుపానుగా మారే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఒకవేళ ఈ అల్పపీడనం తుపానుగా రూపాంతరం చెందితే, ప్రపంచ వాతావరణ సంస్థ నిబంధనల ప్రకారం ఇరాన్ దేశం సూచించిన 'అక్వాన్' అనే పేరును పెట్టనున్నారు. ఈ కొత్త తుపాను హెచ్చరికలతో తీరప్రాంత ప్రజల్లో మళ్లీ తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

బంగ్లాదేశ్ సరిహద్దుల నుండి..

ఈ తుపాను తీవ్రత బంగ్లాదేశ్ సరిహద్దుల నుండి ఉమ్మడి గోదావరి జిల్లాలు, కాకినాడ, తమిళనాడు తీరం వరకు విస్తారంగా ప్రభావం చూపే అవకాశం ఉందని సమాచారం. తీవ్రమైన గాలులతో పాటు తీరం వెంట భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందనే సంకేతాలతో అధికార యంత్రాంగం, మత్స్యకారులు ముందస్తు అప్రమత్తతకు సన్నాహాలు చేస్తున్నారు. సుదీర్ఘమైన తీరప్రాంతం కలిగిన కోస్తా జిల్లాలకు ఇది వరుసగా మూడో విపత్తు కానుండటంతో ఆందోళన మరింత తీవ్రతరం అవుతోంది.

ఇప్పటికే రెండు తుపానుల ఎఫెక్ట్

ఇప్పటికే 'అర్నాబ్', 'మురుసు' వంటి తుపానుల తీవ్ర ధాటికి ఆంధ్రప్రదేశ్ దాదాపు రూ. 5,000 కోట్ల మేర ఆర్థిక నష్టాన్ని చవిచూసింది. కాకినాడ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో భారీగా పంట, ఆస్తి నష్టం సంభవించింది. బాధితులకు ఇంకా పునరావాస, సహాయక చర్యలు పూర్తిస్థాయిలో కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడిప్పుడే సాధారణ స్థితికి చేరుకుంటున్న ఈ ప్రాంతాలపై 'అక్వాన్' రూపంలో మరో సంక్షోభం ముంచుకొస్తుండటంతో తీర ప్రాంత ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు.

ముస్లింలను విద్యకు దూరం చేసేందుకు కుట్ర

కేంద్రంపై అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆరోపణలు

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :

దేశంలోని పలు రాష్ట్రాల్లో ముస్లింలను విద్యకు దూరం చేయడానికి పక్కా వ్యూహంతో కుట్ర జరుగుతోందని ఎఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన గురువారం హైదరాబాద్‌లో జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ అధికారిక గణాంకాలను ఆధారంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. బెంగాల్, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో వందలాది ముస్లిం జనాభా ఉన్న గ్రామాల్లో కనీసం ఒక్క ప్రాథమిక పాఠశాల కూడా లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తాను చెబుతున్న సొంత సమాచారం కాదని.. స్వయంగా భారత ప్రభుత్వమే వెల్లడించిన అధికారిక డేటా అని అసదుద్దీన్ ఒవైసీ ధ్వజమెత్తారు.

యూపీలో ఎన్‌రోల్‌మెంట్ తగ్గింపు..

ఇక ఉత్తరప్రదేశ్‌లో ముస్లిం జనాభా 19.26 శాతంగా ఉందని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. 2021-22 ప్రభుత్వ డేటా ప్రకారం.. ప్రాథమిక విద్యలో ముస్లిం పిల్లల చేరికలు 17.3 శాతంగా ఉందని తెలిపారు. అయితే ఇది సెకండరీ స్థాయికి వచ్చేసరికి 12.6 శాతానికి, హయ్యర్ సెకండరీకి వచ్చేసరికి 11.4 శాతానికి ఘోరంగా పడిపోతోందని పేర్కొన్నారు. పాఠశాల విద్య పూర్తయ్యేసరికే ఇన్ని విద్యా సంవత్సరాల వ్యవధిలో పిల్లలు బడికి దూరమవడానికి కారణమెవరు..? కచ్చితంగా ప్రభుత్వమే దీనికి బాధ్యత వహించాలని అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు.

విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యం..

ముస్లిం విద్యార్థుల విద్యావకాశాలను మెరుగుపరచడానికి, తగిన చర్యలు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సుముఖత చూపడం ఒవైసీ మండిపడ్డారు. ఒకవైపు తగినన్ని పాఠశాలలు అందుబాటులో లేకపోగా, మరోవైపు విద్యాభ్యాసానికి అనుకూలమైన సురక్షితమైన వాతావరణం కూడా అక్కడ కనిపించడం లేదన్నారు. బీజేపీ (దీజ్రో) అధికారంలో ఉన్న ప్రతి రాష్ట్రంలోనూ ముస్లింలను విద్యావ్యవస్థకు, ఉన్నత చదువులకు దూరం చేయడమే లక్ష్యంగా కుట్రపూరితమైన ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.

ప్రముఖ సంగీత విద్వాంసుడి జయంతి రూ.250 స్మారక నాణేన్ని విడుదల చేసిన కేంద్రం



ఢిల్లీ:

కర్ణాటక సంగీత త్రిమూర్తులలో ఒకరైన ప్రముఖ వాగ్గేయకారుడు ముత్తుస్వామి దీక్షితార్ 250వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.250 ప్రత్యేక స్మారక నాణేన్ని విడుదల చేశారు. వారణాసిలోని ఐఐటీ-బీహెచ్‌యూలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి ఈ నాణేన్ని ఆవిష్కరించారు. అయితే, ముత్తుస్వామి దీక్షితార్ 250వ జయంతికి గుర్తుగా భారత ప్రభుత్వం ఈ రూ.250 నాణేన్ని రూపొందించింది. సాధారణ చెలామణిలో వాడే నాణేల వలె కాకుండా, ఇది ఓ ప్రత్యేక స్మారక నాణెంగా ఉండనుంది. దీనిని భారత ప్రభుత్వ మింట్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆసక్తిగల సంగీతాభిమానులు, కలెక్టర్లు కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉంచారు.

స్టార్ త్రినేత్రం PRGI NO: TGTEL/25/A0438 అనుక్షణం అక్షరసత్యం | శుక్రవారం | 06-11-2026 | పేజీలు: 04 | వెల: 2/- | FRIDAY | 06 - 11- 2026 | PAGES : 04 | PRICE : 2/-

మళ్లీ వోగ్ కవర్‌పై కత్రినా.. ఫ్యాన్స్‌కు స్పెషల్ ట్రీట్!

ఎనిమిదేళ్ల తర్వాత వోగ్ ఇండియా కవర్‌పై మెరిసిన కత్రినా కైఫ్, ప్రసవానంతరం మహిళలు వెంటనే పాత శరీరాకృతికి రావాలనే ఒత్తిడిని తప్పుబట్టారు. బిడ్డ పుట్టిన తర్వాత తన శరీరాన్ని గౌరవిస్తూ, తనకు నచ్చిన వేగంతో ఫిట్‌నెస్ సాధిస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె ఫొటోషూట్, వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.బాలీవుడ్ అందాల నటి కత్రినా కైఫ్ ఎనిమిదేళ్ల విరామం తర్వాత ప్రముఖ 'వోగ్ ఇండియా' మ్యాగజైన్ నవంబర్-డిసెంబర్ 2026 సంచిక కవర్ పేజీపై మెరిసిపోయారు. భర్త వికీ కౌశల్‌తో కలిసి విహాన్ అనే బాబుకు జన్మనిచ్చిన తర్వాత ఆమె ఇచ్చిన ఈ లేటెస్ట్ ఫొటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ప్రసవానంతరం మహిళల శరీరాకృతిపై సమాజం చూపే ఒత్తిడిని, 'బౌన్స్ బ్యాక్' సంస్కృతిని తిరస్కరిస్తూ కత్రినా ఇచ్చిన స్ట్రాంగ్ మెసేజ్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆ విశేషాలు ఇప్పుడు చూద్దాం. రాయల్ వింటేజ్ లుక్‌లో కత్రినా అల్టిమేట్ గ్లామర్: ఈ ప్రత్యేక ఫొటోషూట్ కోసం ప్రముఖ స్టైలిస్ట్ రియా కపూర్ కత్రినాను అత్యంత ఎలిగెంట్‌గా తీర్చిదిద్దారు. ప్రసిద్ధ డిజైనర్లు అబు జానీ సందీప్ ఖోస్లా డిజైన్ చేసిన ఐవరీ హెవీ లక్నోవి, చిక్కన్‌కారీ అవుట్‌ఫిట్‌లో కత్రినా దేవకన్యలా మెరిసిపోయారు. దీనికి తోడు లేయర్డ్ ఆక్సిడైజ్డ్ సిల్వర్ జ్యువెలరీ, స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్ మరియు పెద్ద రింగ్ జత చేయడంతో ఆమె లుక్ రాయల్ క్లాస్‌గా మారింది. ఇక నెటిజన్లు ఈ పిక్స్‌పై "హాట్ ఎలిగెన్స్", "ఎఫర్ట్‌లెస్ బ్యూటీ" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. 'బౌన్స్ బ్యాక్' సంస్కృతిపై కత్రినా స్ట్రాంగ్ కౌంటర్: ప్రసవం తర్వాత మహిళలు వెంటనే పాత రూపానికి రావాలంటూ సమాజం తెచ్చే ఒత్తిడిపై కత్రినా ఘాటుగా స్పందించారు. "బౌన్స్ బ్యాక్ అవ్వాలా? ఎక్కడికి వెళ్లాలి? నా మనసులోని గాఢమైన కోరిక నెరవేరి నేను నా జీవితంలో ఒక అడుగు ముందుకు వేశాను.. అలాంటప్పుడు వెనక్కి ఎందుకు వెళ్తాను?" అని సూటిగా ప్రశ్నించారు. బాబు విహాన్ పుట్టిన క్షణాలు తమ జీవితంలో ఎంతో మధురమైనవని, తన శరీరానికి సరిపడే ఫిట్‌నెస్‌ను తన సొంత వేగంలో సాధిస్తానని ఆమె స్పష్టం చేశారు. మహిళలపై పెరిగిన అందాల ఒత్తిడి: ఇటీవల విక్టోరియా సీక్రెట్ షోలలో లేదా సెలబ్రిటీల ప్రసవానంతర రూపాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చలను కత్రినా తీవ్రంగా ఖండించారు. నాఓమి వోల్ఫ్ రాసిన 'ది బ్యూటీ మిత్' పుస్తకంలో చెప్పినట్లుగా, మహిళల సహజ మార్పులను తప్పుగా చిత్రీకరించడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక తన శరీరాన్ని గౌరవిస్తూ, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా తన స్వంత శైలిలో ముందుకెళ్తానని కత్రినా చెప్పడం విశేషం. బిజినెస్ అండ్ మదర్‌హుడ్ బ్యాలెన్స్: ఒకవైపు నటన, మరోవైపు తన సొంత బ్యూటీ బ్రాండ్ 'కే బ్యూటీ' వ్యాపార బాధ్యతలను చూసుకుంటూనే, మరోవైపు తల్లిగా కొత్త ప్రయాణాన్ని సమర్థవంతంగా ఆస్వాదిస్తున్నట్లు కత్రినా పేర్కొన్నారు.





తరుణ్ భాస్కర్.. నెక్ట్స్ ఆ హీరో దగ్గరికేనా!

వెంకటేష్‌తో 'దెక్కన్ డెర్బీ' సినిమా చేయాలని 2019లోనే తరుణ్ భాస్కర్ ప్రయత్నించారు. కథ సురేష్ బాబుకు నచ్చినా, సెకండాఫ్‌పై సంతృప్తి లేకపోవడంతో ప్రాజెక్ట్ ఆగిపోయింది. స్క్రిప్ట్‌లో మార్పులు చేస్తున్నానని, కథను పక్కనపెట్టలేదని తరుణ్ గతంలోనే స్పష్టం చేశారు. నవంబర్ 19న 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' విడుదల కానుంది. ఈ సినిమా ఫలితం తర్వాత వెంకీ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. తరుణ్ భాస్కర్‌కు విక్టరీ వెంకటేష్‌తో సినిమా చేసే అవకాశం ఎప్పుడో వచ్చింది. కథ కూడా సిద్ధం చేసుకున్నారు. కానీ ఆ ప్రాజెక్ట్ షూటింగ్ వరకు వెళ్లకుండా ఆగిపోయింది. అప్పటినుంచి వెంకీతో సినిమా ఎప్పుడు ఉంటుందని తరుణ్‌కు పలుమార్లు ప్రశ్నలు ఎదురయ్యాయి. ఇప్పుడు 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమాతో మంచి హిట్ అందుకుని మళ్లీ వెంకటేష్ ప్రాజెక్ట్‌పైకి వెళ్తారా అనే ఆసక్తి ఉంది. వెంకటేష్ కోసం తరుణ్ సిద్ధం చేసిన కథ పేరు 'దెక్కన్ డెర్బీ'. హైదరాబాద్‌లో గుర్రపు పందేలు, బెట్టింగ్ నేపథ్యంలో ఈ సినిమా చేయాలనుకున్నారు. 2019లోనే ప్రయత్నాలు మొదలయ్యాయి. సురేష్ బాబుకు కూడా కథ నచ్చింది. అయితే సెకండాఫ్ విషయంలో తరుణ్ సంతృప్తి చెందకపోవడంతో ప్రాజెక్ట్ ఆగిపోయింది. భారీ బడ్జెట్, టెక్నికల్ వర్క్ అవసరమవడం కూడా ఆలస్యానికి కారణమైంది. తరుణ్ కెరీర్ చూస్తే 'పెళ్లిచూపులు'తో మంచి విజయం అందుకున్నారు. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో యూత్‌లో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించారు. 2023లో 'కీడా కోలా'తో క్రైమ్ కామెడీ ప్రయత్నించారు. కానీ ఆ సినిమా ఆశించిన స్థాయిలో కమర్షియల్ హిట్ కాలేదు. మధ్యలో నటుడిగానూ పలు సినిమాలు చేసిన తరుణ్, దర్శకుడిగా మరో పెద్ద విజయాన్ని అందుకోవాలని చూస్తున్నారు. ఈసారి తనకు మంచి గుర్తింపు తెచ్చిన నలుగురు స్నేహితుల కథనే కొనసాగిస్తున్నారు. అయితే మొదటి భాగంలో షార్ట్ ఫిల్మ్ తీయాలనుకున్న గ్యాంగ్, ఇప్పుడు పూర్తిస్థాయి సినిమా చేయడానికి ప్రయత్నిస్తోంది. పాత పాత్రలతో కొత్త సమస్యలను చూపించబోతున్నారు. ముఖ్యంగా అభినవ్ గోమటం కామెడీ, విశ్వక్ సేన్ పాత్రపై ప్రేక్షకులకు ఇప్పటికే మంచి అంచనాలున్నాయి. మరోవైపు వెంకటేష్‌తో సినిమా విషయంలో తరుణ్ గత జనవరిలోనే క్లారిటీ ఇచ్చారు. స్క్రిప్ట్‌లో మార్పులు చేస్తున్నానని, కథ ఇప్పటికీ పనికొస్తుందని చెప్పారు. ప్రాజెక్ట్ ఆగడానికి వెంకటేష్ కారణం కాదని, తానే మరింత వర్క్ చేయాల్సి ఉందని వివరించారు. అంటే కథను పూర్తిగా పక్కనపెట్టలేదు. అయితే వెంకీ నుంచి మళ్లీ డేట్స్ తీసుకోవాలంటే ముందు స్క్రిప్ట్ సిద్ధం కావాలి. నవంబర్ 19న 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' విడుదల కానుంది. విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను నటిస్తుండగా, కార్తీక్ పాత్రలో ఈసారి శ్రీనాథ్ మాగంటి కనిపించనున్నారు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సీక్వెల్ మంచి విజయం సాధిస్తే తరుణ్‌కు స్టార్ హీరోలతో సినిమా చేసే అవకాశాలు మరింత మెరుగుపడొచ్చు.



అన్ని పుకార్లకు చెక్.. 'దాదా' ఫిక్సయితే దబిడి దిబిడే!

నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'దాదా' విడుదల తేదీపై చిత్రబృందం క్లారిటీ ఇచ్చింది. డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా సినిమా విడుదల కానుంది. ఇందులో బాలయ్యను రొటీన్ మాస్ హీరోగా కాకుండా మెచ్యూర్డ్ మాఫియా డాన్‌గా చూపిస్తారా అన్న ఆసక్తి నెలకొంది. థమన్ సంగీతం అందిస్తుండగా, కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రస్తుతం ఎడిటింగ్, డబ్బింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. నటసింహం నందమూరి బాలకృష్ణ ఆలోచనల్లో వేగం, సినిమా పట్ల ఆయనకున్న అంకితభావం చూస్తుంటే సినీ పండితులు సైతం ఆశ్చర్యపోవాల్సిందే. ఇటీవల ఎదురైన చిన్నపాటి గాయాల్ని సైతం లెక్క చేయకుండా, అత్యంత ప్రణాళికా బద్ధంగా షూటింగ్ పూర్తి చేసి.. అనుకున్న సమయానికే దాదా చిత్రాన్ని రిలీజ్ చేయించేలా, తన తదుపరి పనుల్లో మునిగిపోయారు బాలయ్య. సోషల్ మీడియాల్లో -దాదా- విడుదల వాయిదా పడుతోందంటూ వచ్చిన అనవసర పుకార్లన్నింటికీ చిత్రబృందం కొట్టిపారేస్తూ క్లారిటీ ఇచ్చేసింది. సినిమా విడుదల వాయిదా ప్రసక్తే లేదని.. చెప్పిన టైముకే అంటే డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా నటసింహం థియేటర్ల బరిలోకి దిగుతున్నారని ధీమా వ్యక్తం చేసింది. బాలయ్య కమిట్‌మెంట్‌తో పెట్టుకుంటే నిజంగా దబిడి దిబిడే అని మరోసారి ప్రూవ్ కాబోతోందిట. 5 అయితే ఈ గ్రాండ్ రిలీజ్ అప్‌డేట్ ఎంత సంతోషాన్ని ఇస్తుందో.. మరోవైపు అభిమానుల్లో ఒక ఆసక్తికరమైన చర్చకు తెరలేపింది. దర్శకుడు గోపీచంద్ మలినేని బాలకృష్ణను ఇందులో ఎలా చూపించబోతున్నారనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవలి కాలంలో శివ నిర్వాణ -ఇరుముడి-లో మాస్ మహారాజా అంతటివాడినే ఎంతో షటిల్డ్‌గా, పరిణతి చెందిన ప్రశాంతమైన పాత్రలో ఆవిష్కరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. మరి అదే బాటలో గోపీచంద్ మలినేని కూడా బాలయ్యను కేవలం ఒక రొటీన్ మాస్ హీరోగా కాకుండా.. క్యారెక్టర్ డెప్త్ ఉన్న పవర్ ఫుల్ మెచ్యూర్డ్ లుక్‌లో చూపిస్తాడా? లేక తన మార్కు రొటీన్ అవుట్ అండ్ అవుట్ మాస్ ఫార్ములాకే పరిమితమవుతాడా? అనే సందేహాల్ని లేవనెత్తుతున్నారు. ప్రస్తుత పాన్-ఇండియా సినీ ప్రేక్షకుల ఆలోచనా విధానం అసాధారణంగా మారింది. ఎంతటి గ్యాంగ్‌స్టర్ డ్రామా అయినా లేదా ముంబై మాఫియా బ్యాక్‌డ్రాప్ కథ అయినా.. అందులో లౌడ్ యాక్షన్ కంటే కథలోని గాంభీర్యం, పాత్రలోని ఔచిత్యం ముఖ్యం. అతిశయోక్తులు, లాజిక్‌కు అందని ఫైట్లు లేకుండా ప్రస్తుత ఆడియెన్స్ మైండ్ సెట్‌కి తగినట్లుగా రియలిస్టిక్ యాక్షన్ స్టంట్స్‌తో బాలయ్య పాత్రను డిజైన్ చేసి ఉంటారని కూడా భావిస్తున్నారు. బాలయ్యలోని నట విశ్వరూపాన్ని సద్వినియోగం చేస్తూనే ఆయన వయసుకు తగిన గాంభీర్యాన్ని జోడించిన మాఫియా డాన్ పాత్రలో చూపిస్తున్నారా? పాన్-ఇండియన్ ఆడియన్ మనసుల్ని నేరుగా తాకే పాత్రగా ఇది చరిత్రలో నిలిచిపోతుందా? అంటూ ఎవరికి వారు ఊహాగానాలు సాగిస్తున్నారు.



సినిమా సాంకేతిక అంశాలు భేషుగ్గా ఉండేందుకు టీమ్ కృషి చేస్తోంది. నిర్మాణ పురోగతి కూడా అంతే వేగంగా సాగుతోంది. దర్శకుడు గోపీచంద్ మలినేని నేతృత్వంలో ఎడిటింగ్, డబ్బింగ్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతుండగా.. మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.థమన్ ఈ చిత్రానికి మైండ్ బ్లోయింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించే పనిలో ఉన్నారు. కాజల్ అగర్వాల్ కథానాయికగా అలరించనుండగా.. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే నాన్-థియేట్రికల్ రైట్స్ భారీ ధరలకు అమ్ముడవగా.. థియేట్రికల్ బిజినెస్ క్లోజింగ్ స్టేజ్‌కు చేరుకుంది. క్రిస్మస్ రేసులో -దాదా- రాక ఖరారు కావడంతో డిసెంబర్ బాక్సాఫీస్ వద్ద బాలయ్య మాస్ జాతర ఖాయంగా కనిపిస్తోంది. అయితే పక్కా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు ఆధునిక ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా బాలకృష్ణను ఒక కొత్త కోణంలో పవర్‌ఫుల్ అండ్ మెచ్యూర్డ్ గ్యాంగ్‌స్టర్‌గా గోపీచంద్ మలినేని ప్రెజెంట్ చేస్తే మాత్రం థియేటర్లలో రికార్డుల వేట మొదలైనట్లేననే విశ్లేషణ సాగుతోంది. ఎన్బీకేని కింగ్ ఆఫ్ కయాస్ గా చూడాలని అభిమానులు ఆరాటపడుతున్నారు. ఆ మేరకు అంచనాలు పెరిగిపోతున్నాయి. ఇకపై వరుస అప్‌డేట్స్‌తో రాబోతున్న -దాదా- ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

ఇదేమి కన్ఫ్యూజన్ నాని.. అది ఇది కాదు.. అదే ఇది..!

నేచురల్ స్టార్ నాని సినిమాల బాక్సాఫీస్ పరిస్థితి ఇప్పుడు అయోమయంగా మారింది. శ్యామ్ సింగరాయ్, అంటే సుందరానికి, హాయ్ నాన్న సినిమాలు ప్రశంసలు అందుకున్నా భారీ వసూళ్లు సాధించలేకపోయాయి. దసరా మంచి విజయాన్ని అందించగా, సరిపోదా శనివారం, ది ప్యారడైజ్ కలెక్షన్ల పరంగా పర్వాలేదనిపించాయి. విమర్శకుల ప్రశంసలతో పాటు భారీ వసూళ్లు తెచ్చే ఒక్క బ్లాక్‌బస్టర్ నానికి అవసరమనే చర్చ జరుగుతోంది. టాలీవుడ్‌లో నేచురల్ స్టార్ నాని అంటే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అభిమానం ఉంది. సహజమైన నటన, సింపుల్‌గా ఉండే వ్యక్తిత్వం, ఫ్యామిలీ ఆడియన్స్‌కు దగ్గరయ్యే సినిమాలతో నాని తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఆయన సినిమాల బాక్సాఫీస్ పరిస్థితి మాత్రం ఇప్పుడు కొంత అయోమయంగా మారింది. సినిమాలు బాగున్నా కలెక్షన్లు రావడం లేదు. కలెక్షన్లు వచ్చినా సినిమాలకు ఆశించిన స్థాయిలో పేరు రావడం లేదు. శ్యామ్ సింగరాయ్ నుంచి చూస్తే నాని సినిమాల పరిస్థితి ఇదే విధంగా కనిపిస్తోంది. ఈ సినిమా కథ, నటన, భావోద్వేగ సన్నివేశాలతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. కానీ బాక్సాఫీస్ దగ్గర మాత్రం ఆశించిన స్థాయిలో వసూళ్లు రాలేదు. ఇక అంటే సుందరానికి సినిమా గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. విడుదల సమయంలో ఈ సినిమాకు మంచి టాక్ వచ్చినా కలెక్షన్లు మాత్రం నిరాశపరిచాయి. ఆ తర్వాత ఓటీటీలో మంచి ఆదరణ దక్కించుకుంది. చాలామంది ఈ సినిమాను కల్ట్ క్లాసిక్‌గా కూడా భావిస్తున్నారు. కానీ థియేటర్లలో మాత్రం నిర్మాతలు, బయ్యర్లకు ఆశించిన ఫలితం దక్కలేదు. హాయ్ నాన్న కూడా మంచి ప్రశంసలు అందుకున్న సినిమా. తండ్రి, కూతురు మధ్య అనుబంధాన్ని చూపించిన ఈ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్‌కు బాగా కనెక్ట్ అయింది. అయినప్పటికీ భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలవలేకపోయింది. మరోవైపు దసరా సినిమా నానికి మంచి విజయాన్ని అందించింది. తెలంగాణ నేపథ్యం, మాస్ పాత్ర, కథలోని తీవ్రత ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే ఈ సినిమాపై కూడా కొన్ని వర్గాల నుంచి విమర్శలు వచ్చాయి. సరిపోదా శనివారం మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ మంచి వసూళ్లు సాధించింది. ఇక ది ప్యారడైజ్ సినిమాకి నెగిటివ్ టాక్ వచ్చినప్పటికీ



కలెక్షన్ల విషయంలో పర్వాలేదు అనిపించుకుంది. ఇలా నాని సినిమాల విషయంలో ఏది హిట్, ఏది ఫ్లాప్, ఏ సినిమా బయ్యర్లకు లాభాలు తెచ్చింది అనే అంశాలు కన్ఫ్యూజన్‌గా మారుతున్నాయి. మంచి సినిమాలు తీస్తున్నా ప్రతిసారీ భారీ లాభాలు రావడం లేదు. అలా అని ఏ సినిమా కూడా డిజాస్టర్ అవ్వడం లేదు. నాని క్రేజ్‌పై ఎలాంటి సందేహం లేదు. కానీ ఆయనకు ఇప్పుడు కావాల్సింది విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ దగ్గర కూడా భారీ విజయాన్ని అందించే సినిమా. కలెక్షన్లు తెచ్చుకొని.. పేరు తెచ్చుకోకుండా.. లేకపోతే పేరు తెచ్చుకొని కలెక్షన్లు తెచ్చుకోకుండా.. ఇలాంటి అయోమయంలో ఉండే సినిమాలు కాకుండా.. ఏదైనా ఒక్క బ్లాక్ బస్టర్ సినిమా తీస్తే ఇక నాని లెవెల్ వేరే.

మొత్తానికి 'రామాయణ' నుంచి హనుమ ట్రీట్.. కానీ!

లేటెస్ట్ గా ఎన్నో అంచనాలు సెట్ చేసుకొని బిగ్ స్క్రీన్స్ పై అలరించేందుకు వచ్చిన లేటెస్ట్ సినిమానే 'రామాయణ'. రణబీర్ కపూర్ హీరోగా సాయి పల్లవి, యష్ లను స్టార్ నటీనటులు కలయికలో దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కించిన ఈ సినిమా ఇప్పుడు బిగ్ స్క్రీన్స్ లో గ్రాండ్ ట్రీట్ అందిస్తుంది. అయితే ఈ సినిమా విషయంలో మొదటి నుంచి సస్పెన్స్ గా ఉంచిన అంశం ఏదన్నా ఉంది అంటే అది బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ పోషించిన హనుమ పాత్ర అనే చెప్పాలి.తెలుగు సినిమా వార్తలు తన లుక్ కి సంబంధించి చిన్న లీక్ కూడా బయటకి రాకుండా డైరెక్ట్ గా థియేటర్స్ లోనే తన ప్రెజెన్స్ ని మేకర్స్ రివీల్ చేసి మరింత కిక్ ఇచ్చారు. అయితే ఇక్కడ చిన్న ట్విస్ట్ ఏంటంటే మేకర్స్ పూర్తిగా సన్నీ డియోల్ లుక్ ని రివీల్ చేయలేదు. తన ముఖాన్ని మాత్రం చూపించకుండా తన పాత్ర ప్రభావం ఎలా ఉంటుంది అనేది పలు విజువల్స్ తో ప్రెజెంట్ చేసారు. ముందు థియేటర్స్ లో ప్రదర్శన తర్వాత ఆన్లైన్ లో సాంగ్ గా అదే కంటెంట్ ని విడుదల చేశారు. ఇలా మొత్తానికి రెండో పార్ట్ లో సన్నీ డియోల్ పాత్ర పెద్ద ఎత్తున హైలైట్ కానుంది అని చెప్పవచ్చు



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com